క్లుప్తంగా

ఎస్వీయూ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ఎస్వీయూ వీసీ

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూ ఇంజినీరింగ్ విద్యార్థులు 18 మంది ఉద్యోగాలు సాధించారు. తైవాన్‌కు చెందిన గ్రీన్‌టెక్ కంపెనీ ప్రతినిధులు కళాశాలలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కళాశాలకు చెందిన 11 మంది మెకానికల్, ఐదుగురు ఎలక్ట్రికల్, ఇద్దరు ఎంటెక్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి, ప్రిన్సిపల్ ఆర్‌వీఎస్.సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ అధికారి మురళీ అభినందించారు.

స్వాతికి డాక్టరేట్



తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ విభాగపు పరిశోధక విద్యార్థిని పి.స్వాతికి డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొఫెసర్ ఎస్.జ్యోతి పర్యవేక్షణలో 'ఐడెంటిఫయింగ్ డయాబెటిక్ రెటినోపతి యూజింగ్ బిగ్ డేటా అనలిటిక్స్ బేస్డ్ ఆన్ లాంగ్ నాన్ కోడింగ్ అండ్ సర్కులర్ ఆర్ఎన్ఏస్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని మహిళా వర్సిటీకి సమర్పించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

పాకాల: మండలంలోని పెద్దరామాపురం పంచాయతీ చిగరపల్లె గ్రామానికి చెందిన ఈడిగ గౌడ సంఘం మండల అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్ తల్లి పాపులమ్మ (100)కు ఆ సంఘం నాయకులు బుధవారం నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు. దహన సంస్కారాల కోసం రూ.7,500 అందజేశారు. సంఘం నాయకులు శ్రీనివాసులుగౌడ్, సంఘం సభ్యులు గోపి, రెడ్డెప్ప, వెంకటేష్, రవి, యువరాజులు, దొరస్వామి, ఆదికేశవులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై అలిమేలు మంగమ్మ



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు బుధవారం తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర నక్షత్రం (పంగుణి ఉత్తరం) సందర్భంగా తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను పూర్తి చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. తదుపరి అమ్మవారు తిరుచ్చిపై మాడ వీధుల్లో విహరించారు. ఆలయ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, ప్రసాదాల ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఐ రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పాకాల: మండలంలోని పంటపల్లె గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ పాకాల డివిజన్ అధ్యక్షుడు ఎస్.కపిలేశ్వర్‌రెడ్డి తండ్రి ఎస్.రాజారెడ్డి కర్మక్రియల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. బుధవారం పంటపల్లె చేరుకున్న ఎమ్మెల్యే మృతుడు రాజారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు నంగా పద్మజారెడ్డి, ఎంపీపీ లోకనాథం, నాయకులు నంగా బాబురెడ్డి, నంగా నరేష్‌రెడ్డి, హరిరెడ్డి, మునీర్, హరిప్రసాద్‌రెడ్డి, రమేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి మోహిత్ రెడ్డి పాదయాత్ర

భాకరాపేట: చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి యల్లమంద పంచాయతీ నగరి గ్రామం నుంచి గురువారం పాదయాత్ర ప్రారంభించనున్నారు. ఉదయం తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర మొదలుపెడతారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తారు.

శ్రీకోదండరామస్వామికి సారె



కోదండరామునికి సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి: మండల కేంద్రంలోని శ్రీకోదండరామస్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. బుధవారం తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేసిన మోహిత్ రెడ్డి కోదండరామునికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రాములోరి కల్యాణం కమనీయంగా సాగింది. రాత్రి స్వామివారు గరుడవాహనంపై భక్తులను కటాక్షించారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చిల్లకూరి యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్లతో నవశకం

- 50 ఏళ్లనాటి అవసరాలకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం
- చింతలచేను రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



చింతలచేను మాస్టర్‌ప్లాన్ రోడ్డును రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు, కమిషనర్

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న మాస్టర్‌ప్లాన్ రోడ్లతో నవశకం ప్రారంభమైందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. సామవాయి (చింతలచేను) రోడ్డును బుధవారం మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. అలానే అన్నమయ్యమార్గ్ రోడ్డును నగర ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ.. 50 ఏళ్ల నాటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిరుపతి నగరంలో 14 మాస్టర్‌ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రోడ్ల అనుసంధానం చారిత్రక అవసరాన్ని గుర్తించి తొలి ప్రాధాన్యతగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే సామవాయి మార్గాన్ని యుద్ధ ప్రాతిపదికన అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. 80 అడుగుల వెడల్పు, 1.5 కి.మీ పొడవుతో రూ.6.3 కోట్ల వ్యయంతో రోడ్డును అభివృద్ధి చేసినట్లు చెప్పారు. బస్టాండ్‌కు కూతవేటు దూరంలో దయనీయ స్థితిలో ఉన్న ఈ ప్రాంతం రోడ్ల అభివృద్ధితో కొత్తరూపు సంతరించుకుందన్నారు. అలానే రూ.7.25 కోట్ల వ్యయంతో అన్నమయ్య మార్గ్ మాస్టర్‌ప్లాన్ రోడ్డును అభివృద్ధి చేశామన్నారు. నగరానికి సరైన కనెక్టివిటీ లేకపోవడం వల్ల విస్తరణ కొంత భాగానికే పరిమితమైందన్నారు. అదే స్థాయిలో ట్రాఫిక్ ప్రజలను తీవ్రంగా వేధిస్తోందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఏకకాలంలో 14 మాస్టర్‌ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేశామని వివరించారు. మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ.. కొత్త రోడ్లు అందుబాటులోకి వస్తే సుమారు 2,500 ఎకరాల్లో తిరుపతి ఆవిష్కృతం కానుందన్నారు. నగర విస్తరణతో పాటు కనెక్టివిటీ పెరగడం వల్ల ప్రజారవాణా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, ఎంఈ చంద్రశేఖర్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం రామారావు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు, వైఎస్సార్‌సేవాదళ్ రీజనల్ కోఆర్డినేటర్ తలారి రాజేంద్ర, డీఈ సంజీవ్‌కుమార్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


నామకరణంలో భూమన ముద్ర

చింతలచేను మాస్టర్‌ప్లాన్ రోడ్డుకు నామకరణం చేయడంలో భూమన తన ముద్రను చాటుకున్నారు. తిరుమల శాసన ఆధారాల ప్రకారం తిరుమల గర్భగుడిలో ప్రతిష్టింపచేసిన భోగశ్రీనివాసమూర్తి విగ్రహాన్ని బహూకరించిన నాటి పల్లవరాణి సామవాయి పేరును ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రతిపాదించారు. శ్రీవారికి తొలి దాతగా సామవాయి చరిత్రలో నిలిచారు. ఆధ్యాత్మిక నగరానికి ఆమె పేరు పెట్టడం వెనుక తిరుపతి పవిత్రతను తెలియజేస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తాను సూచించిన మేరకు కౌన్సిల్ సామవాయి మార్గంగా తీర్మానం చేశారని వెల్లడించారు.



అన్నమయ్యమార్గ్ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

జగదానందకారకుని జలవిహారం



తెప్పపై విహరిస్తున్న స్వామివారు

కోదండరామస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న తెప్పోత్సవాలు బుధవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరణ చేసి ఆలయం నుంచి రామచంద్ర పుష్కరిణికి ఊరేగింపుగా వేంచేశారు. తెప్పను అధిరోహించి విహరించారు. భక్తుల రామనామస్మరణల మధ్య తొమ్మిది చుట్లు విహరించి భక్తులకు కనువిందు చేశారు. ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్ పాల్గొన్నారు.

– తిరుపతి కల్చరల్

దీనజనోద్ధారకుడు జగ్జీవన్‌రామ్



పేరూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి

- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- ఘనంగా జయంతి వేడుకలు

తిరుపతి రూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం తపించిన దీనజనోద్ధారకుడు బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తిరుపతి రూరల్ మండలం పేరూరులోని విగ్రహం వద్ద ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేత దామినేటి కేశవులు, ఎంపీటీసీ సభ్యులు మూలం చంద్రమోహన్ రెడ్డి, రాజేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి లీగల్: కోర్టు ఆవరణలో న్యాయవాదులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ఉపాధ్యక్షుడు డి.గోపిచంద్, జాయింట్ సెక్రటరీ గాలి మధుసూదన్‌రావు, దినకర్, రాజగోపాల్, శివకుమార్, భవానీ శంకర్ పాల్గొన్నారు.

తిరుపతి రూరల్: ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ సంతోషరావు ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, సీజీఎంలు ధర్మజ్ఞాని, వరకుమార్, అయూబ్‌ఖాన్, గురవయ్య పాల్గొన్నారు.

తిరుపతి మంగళం: తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కనకనరసారెడ్డి పుష్పాంజలి ఘటించారు. అలాగే అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి, ఆర్ఐ జానీబాష జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులో ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

తిరుపతి కల్చరల్: ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని దేశానికి ఉపప్రధానిగా ఎదిగిన బాబు జగ్జీవన్‌రామ్ సామాజిక అంతరాలను తొలగించేందుకు ఎంతో కృషి చేశారని, ఆయన అడుగు జాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉస్మానియా వర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ లా డీన్ ఆచార్య గాలి వినోద్‌కుమార్ అన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో బుధవారం మహతి కళాక్షేత్రంలో జయంతి వేడుకలు నిర్వహించారు. విశేష సేవలందించిన పలువురికి జ్ఞాపికలు, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు కోయి కోటేశ్వరరావు, తిరుపతి క్రైమ్ సీఐ సుమతి బాబు, టీటీడీ డిప్యూటీ ఈఓలు స్నేహలత, ఆనందరాజు, జగదీశ్వరి, ఈఈ మనోహరం పాల్గొన్నారు.



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంబీయూ చాన్స్‌లర్ మోహన్‌బాబు



నివాళులర్పిస్తున్న ఆర్డీఓ కనకనరసారెడ్డి

ఆదర్శనీయుడు జగ్జీవన్‌రామ్

చంద్రగిరి: మండల పరిధిలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో చాన్సలర్ మోహన్ బాబు, ప్రో చాన్సలర్ మంచు విష్ణు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి. అనంతరం సుమారు 20వేల మంది విద్యార్థులతో కలిసి ఏ. రంగంపేట నుంచి రామిరెడ్డిపల్లె వరకు రోడ్లపై చెత్తను శుభ్రం చేశారు. మోహన్‌బాబు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు జగ్జీవన్‌రామ్ లాంటి వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీసీ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ సారథి పాల్గొన్నారు.



మహతిలో..విశేష సేవలందించిన వారిని జ్ఞాపికలతో సత్కరిస్తున్న అతిథులు

వివాహ కానుక అందజేత

పాకాల: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందజేసిన వివాహ కానుకను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. మండలంలోని సామిరెడ్డిపల్లె పంచాయతీ బండపాకాల గ్రామంలో ఎంపీపీ లోకనాథం బావమరిది గణపతి, శ్వేతలకు వివాహం జరగనుంది. ఈ సందర్భంగా నూతన వధూవరులకు ఎమ్మెల్యే పంపించిన బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, బాచికం, మహార్జపు పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు–కుంకుమతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మంగళంలో రూ.20 లక్షలతో సీసీరోడ్డు

తిరుపతి మంగళం: తిరుపతి రూరల్ మండలం మంగళం పంచాయతీలో రూ.20 లక్షల తుడా నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భూమి పూజ చేశారు. సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, సర్పంచ్ వరలక్ష్మి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు గుండ్రాజు శివశంకర్‌రాజు, లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డి, హరికృష్ణ, బైరెడ్డి రమేష్, మల్లెమొగ్గల ఉమాపతి పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఘనంగా కరుణన్న జన్మదిన వేడుకలు



భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, చిత్రంలో మేయర్, డిప్యూటీ మేయర్లు, కమిషనర్, కార్పొరేటర్లు

- వేదపండితుల ఆశీర్వాదం
- శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

తిరుపతి మంగళం: తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పద్మావతిపురంలోని ఆయన నివాసం వద్ద గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఎమ్మెల్యేకి ఆశీర్వాదం అందించారు.

శుభాకాంక్షల వెల్లువ

డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే. రోజా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ విభాగాల ఇన్‌చార్జ్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి నగర మేయర్ శిరీష, డాక్టర్ మునిశేఖర్ దంపతులు, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మనోహర్‌రెడ్డి, ఎగ్గిబిషన్ శ్రీనివాస్, పులిగోరు నిరంజన్‌రెడ్డి, రమేష్ రెడ్డి, అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత అనిత్‌కుమార్‌రెడ్డి, అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ తిప్పారెడ్డి పలువురు ప్రముఖులు ఎమ్మెల్యే నివాసంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

- రుయా ఆసుపత్రి వద్ద డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ 2 వేల మందికి చికెన్ బిర్యానీ పంపిణీ చేశారు. కార్పొరేటర్ ఆంజినేయులు, జేసీఎస్ అధ్యక్షుడు కిషోర్ పాల్గొన్నారు.
- టౌన్‌బ్యాంక్ వద్ద చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. రైల్వేస్టేషన్, విష్ణునివాసం ప్రాంతాల్లో సుమారు వెయ్యిమందికి అన్నదానం చేశారు. టౌన్‌బ్యాంక్ వైస్‌చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్లు జ్యోతిప్రకాష్, కాసీమ్, మబ్బు నాథమునిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్ర పాల్గొన్నారు.
- తిరుపతి 21వ డివిజన్‌లో పార్టీ నాయకులు చిరంజీవిరెడ్డి, అనీల్, కుమార్, అనీల్‌రెడ్డి ఐదుగురు పేదలకు రూ. 5 వేల చొప్పున అందజేశారు.



కరుణాకర రెడ్డిని సన్మానిస్తున్న దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి






అనిత్‌కుమార్‌రెడ్డి, తిప్పారెడ్డి, ఎమ్మెల్సీ సుబ్రమణ్యం, జీఈఎఫ్ చైర్మన్ చల్లా చంద్రయ్య, కో చైర్మన్ రాజా

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



శ్రీబాలాజీ వడ్డెర వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

తిరుపతి కల్చరల్: శ్రీబాలాజీ వడ్డెర వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం బుధవారం జీవకోనలోని శివాలయ ఆవరణలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా దేరంగుల బాలాజీ, గౌరవ అధ్యక్షుడు ఎం.శేఖర్, గౌరవ సలహాదారుడు వి. రమణ, ప్రధాన కార్యదర్శి ఎస్. చంద్రయ్య, సహాయ కార్యదర్శి జి.వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా మదన్‌మోహన్, సుబ్బరాయుడు, జగన్నాథం, మోహన్ బాలాజీ, ప్రచార కార్య దర్శి రాజేష్, శివ, ఆర్గనైజింగ్ కార్యదర్శి మునీ శ్వరయ్య, లీగల్ అడ్వైజర్ మోహన్, కీర్తి శంకర్, కోశాధికారి బండి సుబ్రమణ్యం ప్రమాణం చేశారు.

అప్పర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు

తిరుపతి తుడా: నగర పరిధిలోని 25వ డివిజన్‌లో సుమారు రూ.48 లక్షల వ్యయంతో కస్తూరి బాయి వీధి–కర్నాల వీధులను కలుపుతూ నిర్మించనున్న అప్పర్ పాస్ బ్రిడ్జి పనులకు మేయర్ శిరీష బుధవారం భూమి పూజ చేశారు. రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే రైల్వే అండర్ బ్రిడ్జితో పాటు బాలాజీకాలనీ ఫ్రీలెఫ్ట్, కోర్టు మార్గం విస్తరణ, గాంధీ విగ్రహం కూడలి ఆధునీకరణ, మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణం వంటి అనేక నిర్మాణాలు చేపట్టామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ తెలిపారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు నరసింహ ఆచారి, రత్నకుమారి, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

8న వాహనాల బహిరంగ వేలం

చంద్రగిరి: మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్‌లో ఈ నెల 8వ తేదీ ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ లీలారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా నిర్దేశించిన ధరావత్తు రుసుం చెల్లించాలన్నారు.